క్లుప్తంగా

కొత్తపేటలో ఘనంగా ఉరుసు



గంధంను ఊరేగిస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: కొత్తపేట(కొత్తూరు)లోని చెరువు కట్టపై వెలసిన యాదుల్లా బాషా రహంతుల్లా అలైహి ఖాద్రీ ఉరుసు గురువారం ఘనంగా ప్రారంభమైంది. వేకువ జామున పాతూరు నుంచి గంధంను చెరువు కట్ట వరకు ఊరేగించి దర్గాలో సమర్పించారు. జిల్లా నుంచే కాక కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కుబడి ఉన్న భక్తులు దర్గాలో చాదర్‌ను సమర్పించారు. దర్గా వద్ద రాత్రి బయాన్ ఏర్పాటు చేశారు. శుక్రవారం జియారత్‌తో ఉరుసు ముగుస్తుందని కమిటీ సభ్యులు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో బంకుల దగ్ధం



కాలిపోతున్న బంకులు

గుత్తి: పట్టణంలోని రాయల్ సర్కిల్ సమీపంలో గురువారం తెల్లవారు జామున జరిగిన అగ్ని ప్రమాదంతో రెండు బంకులు దగ్ధమయ్యాయి. స్థానికుల వివరాల మేరకు..రాయల్ సర్కిల్ సమీపంలో రాజశేఖర్ , నరేష్(గౌడ్)కు చెందిన బంకులకు గుర్తుతెలియని వ్యక్తులకు నిప్పు పెట్టారు. మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ చొరవతో మున్సిపల్ సిబ్బంది, స్థానికులు మంటలను ఆర్పడానికి శ్రమించారు. దీంతో పక్కనున్న బంకులు, దుకాణాలకు మంటలు వ్యాపించలేదు. ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

గుత్తి రూరల్: సేవాగఢ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సందీప్ యాదవ్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. వారిలో ఇద్దరు విద్యార్థులు మలేరియా బారినపడ్డారని వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆదినారాయణ రెడ్డి, వైద్య సిబ్బంది ఆంజనేయులు, సరస్వతి పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ



తిమ్మప్పను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుత్తి రూరల్: పూలకుంట గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త బోయ తిమ్మప్పను గురువారం ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పరామర్శించారు. గ్రామానికి చెందిన తిమ్మప్ప ప్రమాదవశాత్తు కింద పడి కాలు విరిగింది. ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న తిమ్మప్పను ఎమ్మెల్యే పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

తాడిపత్రి టౌన్ : విశాఖపట్నం జిల్లా ఎలమంచిలిలో ఈనెల 11,12 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో సబ్ జూనియర్, కాడెట్ పోటీలకు తాడిపత్రి క్రీడాకారులు ఎంపికయ్యారు. సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో నియాజ్, హుస్సేన్, లోకేష్ గౌడ్, విష్ణు, నవదీప్, సబ్ జూనియర్ బాలిక విభాగంలో సుభిక్షిత, మహతి, అక్షయ, కేడెట్ బాలుర విభాగంలో షెక్షావలి, రంగ, దీరజ్, హర్షవర్ధన్‌రెడ్డి, కేడెట్ బాలిక విభాగంలో సాయి దీప్తి, అనిత, శ్రీవిద్య ఎంపికయ్యారు. వారిని తైక్వాండో కోచ్ సాయిబాబా గురువారం అభినందించారు.

వీధి కుక్కలన్నింటికీ వ్యాక్సినేషన్

గుంతకల్లుటౌన్: పట్టణంలో వీధి కుక్కల నుంచి ప్రజలను కాపాడేందుకు వాటికి వ్యాక్సిన్ వేయిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, కమిషనర్ బండి శేషన్న తెలిపారు. గురువారం చైర్‌పర్సన్ చాంబర్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో 3,224 వీధి కుక్కలు 600 పెంపుడు కుక్కలు ఉన్నట్లు గుర్తించామన్నారు. రేబిస్ నియంత్రణలో భాగంగా వీధి కుక్కలన్నింటికీ వ్యాక్సిన్ చేయిస్తున్నామన్నారు. వీధి కుక్కల సంతానోత్పత్తి లేకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తున్నామన్నారు. ఇందుకు పురప్రజలు, జంతుప్రేమికులు సహకరించాలని కోరారు.

జగనన్న ప్రభుత్వంపైనే ప్రజావిశ్వాసం



బహిరంగ సభకు తరలిచ్చిన జనం



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన జేసీ అనుచరులు

• ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: జగనన్న ప్రభుత్వంపైనే ప్రజావిశ్వాసం ఉందని, గత 30 ఏళ్లలో జేసీ సోదరులు చేసిన అక్రమాలు, అవినీతి, దౌర్జన్యాలతో వారిపై ప్రజలకు నమ్మకం పోయిందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. గురువారం ప్రజాసంక్షేమ పాదయాత్ర చింతరపల్లి నుంచి చిన్నపప్పూరు మీదుగా సాగిన పెద్దపప్పూరులో బహిరంగ సభతో ప్రజా సంక్షేమ యాత్ర ముగిసింది. ఆయా గ్రామాల్లో మహిళలు, కార్యకర్తలు హారతులిచ్చి బంతిపూలను చల్లుతూ ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి రామకోటివద్ద పాదయాత్రకు సంఘీబావం తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ గతంలో జేసీ సోదరులు నియంతల పాలన సాగించారన్నారు. జేసీ సోదరుల వద్ద ఉంటే ఇక తమ భవిష్యత్తు ఉండదని భావించిన వారి అనుచరులు వైఎస్సార్‌సీపీలోకి క్యూ కడుతున్నారన్నారు. ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథ రెడ్డి, ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి, జిల్లా పార్లమెంటు జనరల్ సెక్రటరీ రవిప్రసాద్ రెడ్డి, ఎంపీటీసీ మేకల సరోజ, సర్పంచులు ఓబులమ్మ, రమేష్ నాయుడు, సీనియర్ నాయకులు ముచ్చుకోట అమర్‌నాథరెడ్డి, నామనాంకపల్లి రఘునాథరెడ్డి, చింతరపల్లి వెంకటరామిరెడ్డి, బాసూ సాహెబ్, చిన్నపప్పూరు బిందెల భాస్కర్‌రెడ్డి, బిందెల చెన్నారెడ్డి (బాబు), రాజారెడ్డి, పెద్దపప్పూరు అశోక్ రెడ్డి, జనార్దన్‌డ్డి, సంజీవరెడ్డి, బండారు ప్రకాష్, రామకోటి చింతా రామ్ ప్రసాద్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ చేరిక

ప్రజాసంక్షేమ పాదయాత్రలో భాగంగా కొట్టాలపల్లికి చెందిన జేసీ వర్గీయులు దబ్బర ప్రతాప్ నాయుడు, దబ్బర రమేష్ నాయుడు, దబ్బర సాయి,చల్లా ప్రహ్లాద నాయుడులతో పాటు మరో ఇద్దరు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వారికి పార్టీ కండు వావేసి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తామని పార్టీలో చేరిన వారు పేర్కొన్నారు.

మండలంలో శరవేగంగా అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ జాషువా

గుంతకల్లు రూరల్: మండలంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎంపీపీ బీవీ మాధవి, ఎంపీడీవో జాషవా, జెడ్పీటీసీ కదిరప్ప పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్బంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ 25 మండలంలో రూ.5.7 కోట్లతో 14 సచివాలయాలు, 14 ఆర్బీకేలు, 9 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ పనులు చేపట్టామన్నారు. దాదాపు రూ.21 కోట్లతో తారురోడ్లు నిర్మించామన్నారు. ఉపాధి హామీ కింద పండ్ల తోటల పెంపకానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ సాలయ్య తెలిపారు. మార్చి 1 నుంచి పశువులకు గాలికుంట వ్యాధి టీకాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని, అదేవిధంగా ఏప్రిల్ 1 నుండి 15వ తేదీ వరకూ నట్టల నివారణ మందు పంపిణీ చేస్తామని వెటర్నరీ డాక్టర్ మహేష్ తెలిపారు. వేసవి దృష్ట్యా రైతులకు 75 శాతం సబ్సిడీతో దాణ పంపిణీ చేస్తామన్నారు. పశుగ్రాసం పెంపకానికి రైతులకు గడ్డి విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ విషయాలన్నింటిపైనా రైతులకు అవగాహన కల్పించాలని ప్రజా ప్రతినిధులకు తెలియజేశారు. చింతలాంపల్లికి ఏడాది క్రితం మినరల్ వాటర్ ప్లాంట్ మంజూరైనా ఎందుకు ఏర్పాటు చేయడం లేదని సర్పంచ్ అధికారులను ప్రశ్నించగా త్వరలోనే చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కో ఆప్షన్ సభ్యుడు సిపాయి బాషా, ఎంపీటీసీలు, సర్పంచులు, ఈవోఆర్డీ బారన్ సాహెబ్, మండల ఇంజనీర్ ఓబులేసు, ఏఓ స్వాతి, హెచ్ఓ మిత్రవింద మాధవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పుష్పావతి, షాహిదా తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

పామిడి: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గుత్తి బార్ అసోసియేషన్ ప్యానల్ అడ్వొకేట్ వీసీ గంగాధర్‌కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక కస్తూర్బా పాఠశాలలో అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయసేవాసమితి అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ రకాల చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ 1098 కో-ఆర్డినేటర్ బాలాజీ, కోర్టు సిబ్బంది సాదిక్, పీఎల్‌వీ ఇస్మాయిల్, ఎస్ఓ సౌభాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఉపాధ్యాయినులన సన్మానించిన దృశ్యం

గుత్తి రూరల్: తొండపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం శ్రీధర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయినులు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ మహిళలను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయినులు శ్రీదేవి, జయనిర్మల, సునీత, ఇందిరమ్మ, భారతి, భోజన ఏజెన్సీ మహిళలు సుబ్బమ్మ, నాగేశ్వరమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

తాడిపత్రి టౌన్: స్థానిక గన్నేవారిపల్లి కాలనీలోని బిందెల కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నారాయణమ్మ, అంగన్ వాడీ వర్కర్స్‌ను కాలనీ మహిళలు సన్మానించారు. ఈసందర్భంగా వక్తలు వారి సేవలను కొనియాడారు.

గార్లదిన్నె: సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్ఐ సాగర్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుకూలంగా మహిళలు చైతన్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్డీటీ సీఓ వరలక్ష్మి, కౌన్సిలర్ సునీత, ఆర్డీటీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: మహిళలు మరింత అభివృద్ధిని సాధించాలని ఐసీడీఎస్ ఏసీడీపీఓ డిల్లేశ్వరి సూచించారు. గురువారం నక్కనదొడ్డిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతితో పాటు, ఏసీడీపీఓ హాజరై మాట్లాడారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను ఆశీర్వదించండి



ప్రచారం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ ఎన్.భవాని, కౌన్సిలర్ చాంద్‌బాషా



ఓటు అభ్యర్థిస్తున్న జెడ్పీటీసీ భాస్కర్

గుంతకల్లుటౌన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీచేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎం.వీ.రామచంద్రారెడ్డికి గెలిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని కోరారు. గురువారం పట్టణంలోని 29,28 వార్డుల్లో కౌన్సిలర్ జేసీబీ చాంద్‌బాషాతో కలిసి ఆమె పట్టభద్రులు, టీచర్ల ఇళ్లకు వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు. అలాగే వివిధ వార్డుల్లో కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు ప్రచారం నిర్వహించారు.

గుత్తి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని గురువారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్ బీ, పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్దన్ రెడ్డి, వైస్ చైర్‌పర్సన్‌లు వరలక్ష్మి, పద్మలత, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్‌యాదవ్, పట్టణ సచివాలయ కన్వీనర్ రంగస్వామి, కౌన్సిలర్లు వరదరాజులు, వాల్మీకి శివ, కేవీ రమణ, ఫరూక్, నరేష్ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ అభ్యర్థి వెన్నపూస రవీంద్రా రెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ రామచంద్రా రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వార్డు ఇన్‌చార్జ్‌లు మర్తాడు అన్సార్, జీవు రమణ, హమాలి రామాంజి, అరటి పండ్ల చంద్ర, సునీల్, పగడాల మురళి, అబ్దుల్, రమేష్‌రెడ్డి, చెన్నాజీ, పూల మహమ్మద్, ఆటో షాషావలి తదితరులు పాల్గొన్నారు.

పామిడి: స్థానిక పట్టణ సచివాలయాల కన్వీనర్ బీ ఆసిఫ్ ఆధ్వర్యంలో పామిడిలో, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే నారాయణరెడ్డి ఆధ్వర్యంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూధన్‌రెడ్డి, రూరల్ సచివాలయాల కన్వీనర్ ఎం కుమార్‌రెడ్డి దిబ్బసానిపల్లి, రామగిరి, రామగిరి ఎగువ, దిగువ తండాలు, ఎద్దులపల్లిలో విస్తృత ప్రచారం చేశారు.

యాడికి: రాయలచెరువు గ్రామంలో మాజీ జెడ్పీటీసీ వెంకటరామి రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి , రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు. సర్పంచు తలార అరుణ నాగేష్, వైస్ ఎంపీపీ జమ్మలమడుగు హసీనాభేగం, సీనియర్ నేత బాలా రమేష్‌బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, నాగేష్, శివయ్య, రవికాంత్ పాల్గొన్నారు.

నార్పల: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి కోరారు. గురువారం ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి మండల కేంద్రంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఎంపీపీ నాగేశ్వరావు, ఉప సర్పంచు గవ్వల శ్రీరాములు, నాయకులు దాడితోట బాష, ఖాదర్‌వలిఖాన్, మన్నీల శివయ్య, బాలనాగి బాలకృష్ణ, గొళ్ల సుధాకర్, గోపాల్, వెంకటరామిరెడ్డి, నారాయణరెడ్డి, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిని గెలిపించాలని ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్ పేర్కొన్నారు. గురువారం సిద్దరాంపురం, దండువారిపల్లి, ఏడావులపర్తి, ఓబులాపురంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, బీకేఎస్ సర్పంచ్ పార్వతి, నాయకులు బుల్లే నారాయణస్వామి, శ్రీనివాస రెడ్డి, సాకే లక్ష్మీనారాయణ, పూల రంగా, చంద్రమోహన్, నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు: ఈ నెల 13న జరిగే పశ్చిమ రాయలసీమ పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి కోరారు. గురువారం ఆయన మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. సర్పంచ్ ఓబులేశు, మండల కన్వీనర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ సాయిరాం

గార్లదిన్నె: పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యమని డీఈఓ సాయిరాం పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో అనంత సంకల్పం కార్యక్రమంలో భాగంగా రాత్రి 9 గంటల సమయంలో పదోతరగతి విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి చదువుపై ఆరా తీశారు. ఈసందర్బంగా ఆయన విద్యార్థులు సబ్జెక్టు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారా? ప్రతి విద్యార్థి పూర్తిస్థాయిలో సన్నద్ధం అవుతున్నారా? వంటి విషయాలు పరిశీలించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పూర్తిస్థాయిలో చదవి ఉత్తీర్ణత పొందాలన్నారు. టీవీలు చూడడం, సెల్‌ఫోన్ వాడటం చేయరాదన్నారు. ఏఎంఓ హరికృష్ణ, ఏపీఓ నారాయణ స్వామి, ఎంఈఓ చంద్రానాయక్ ,మోడల్ స్కూల్ పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ ఉన్నారు.

పామిడి: పామిడిలో టెన్త్ విద్యార్థుల ప్రిపరేషన్‌ను గురువారం రాత్రి డీఈఓ సాయిరాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్బంగా ఆయన స్థానిక నాగిరెడ్డి కాలనీకి చెందిన పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు ఆయన స్వయంగా వెళ్లారు. ఎంఈఓ జయానాయక్, ఉపాధ్యాయుడు రామాంజనేయులు, సీఆర్పీలు ఉన్నారు.

పెరటికోళ్ల పెంపకం లాభదాయకం



రైతులకు కోళ్లను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

బుక్కరాయసముద్రం: రైతులకు వ్యవసాయంతో పాటు పెరటి కోళ్ల పెంపకం ఎంతో లాభదాయకంగా ఉంటుందని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మాధవి పేర్కొన్నారు. గురువారం రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు పెరటి కోళ్ల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్బంగా మాధవి మాట్లాడుతూ మార్కెట్‌లో చికెన్, కోడిగుడ్లకు మంచి డిమాండ్ ఉందన్నారు. కోళ్ల పెంపకంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తెగుళ్ల వాటి నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. రైతులు ఇంటి పరసరాల ప్రాంతాలలోనే పెరటి కోళ్లు పెంచుకోవచ్చన్నారు. అనంతరం రైతులకు కడక్‌నాథ్ కోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుధారాణి, డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి డాక్టర్ శశికళ, నవీన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తాడిపత్రి: తాడిపత్రి – బుగ్గ ప్రధాన రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. యాడికి మండలం పిన్నేపల్లికి చెందిన రాజవర్ధన్ (30) భోగసముద్రం వద్ద ఉన్న అల్ట్రాటెక్ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. మృతుడి భార్య మల్లేశ్వరి పుట్టిల్లు తాడిపత్రి మండలం పెద్దపొలమడ. కొద్ది రోజుల క్రితం భార్య పుట్టింటికి వచ్చి అక్కడే ఉంటోంది. దీంతో భార్య స్వగ్రామం నుంచే బైక్‌పై పనికి వెళ్లి వచ్చేవాడు. బుధవారం అర్ధరాత్రి విధులు ముగించుకుని బైక్‌పై పెద్దపొలమడకు వస్తుండగా తేళ్లమిట్టపల్లి వద్ద రహదారి పక్కన ఆపిన లారీని ఢీ కొన్నాడు. తీవ్రంగా గాయపడిన అతడిని అనంతపురం తరలించారు. ఆసుపత్రికి చేరుకున్న కాసేపటికే అతడు మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యవసాయ పనిముట్లు వినియోగించుకోండి



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ నారాయణనాయక్

శింగనమల: వైఎస్సార్ యంత్ర సేవ పథకం ద్వారా అందించిన పనిముట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గుత్తి ఏడీఏ నారాయణ నాయక్ సూచించారు. గురువారం నిదనవాడ గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయానికి వ్యవసాయ పనిముట్లు అందించామన్నారు. వాటిని రైతులు అద్దెకు తీసుకొని వినియోగించుకోవాలన్నారు. ఏడీసీసీ బ్యాంక్ అధికారి సునీత, బ్యాంక్ లావాదేవీలపై వివరించారు. ఏఓ చిన్నమ్మ, ఎరువుల హబ్ ఏఈఓ కృష్ణ భగవాన్, వైఎస్సార్ సీపీ నేత నారాయణరెడ్డి,, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో కాన్పులు సురక్షితం

యల్లనూరు: ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలతో తల్లీ బిడ్డ క్షేమంగా ఉంటారని వైద్యులు లోకేష్‌కుమార్, సాయినాగశ్రీలు పేర్కొన్నారు. యల్లనూరు, తిమ్మంపల్లి పీహెచ్‌సీల్లో గురువారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మధుకుమార్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రంలో గురువారం గర్భిణులకు డాక్టర్ స్వాతిలక్ష్మి వైద్యపరీక్షలు నిర్వహించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ స్వాతిలక్ష్మి తెలియజేశారు. అమీనమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, ఆధ్యాత్మిక గురువు సిరాజుద్దీన్ గర్భిణులకు భోజన సౌకర్యం కల్పించారు సీహెచ్ఓ మోహన్‌రావు, సూపర్ వైజర్లు ఈశ్వరమ్మ, హెల్త్ అసిస్టెంట్లు ధనుంజయ, ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: నాగసముద్రం పీహెచ్‌సీలో గురువారం మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్‌కుమార్ బాబు వైద్యపరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు ఆరోగ్య సూత్రాలు వివరించారు. డాక్టర్ సాయి ప్రశాంత్, హెల్త్ ఆఫీసర్ సుజాత, సూపర్‌వైజర్ సుజాత, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్ పాల్గొన్నారు.

14న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

యల్లనూరు: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఈనెల 14న నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేయనున్నట్లు మండల వైద్యాధికారి లోకేష్‌కుమార్ తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో నులిపురుగుల నివారణ దినోత్సవంపై ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు లోకేష్‌కుమార్ మాట్లాడుతూ 1–19 ఏళ్లున్న విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రను పంపిణీ చేస్తామన్నారు. తహసీల్దారు రమాదేవి, ఎంఈఓ చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొండన్న , అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, ఎంపీహెచ్ఈవో వీరనారాయణ, మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతకు మారుపేరు భారతీ సిమెంట్



బాండ్లను అందజేస్తున్న మోతీలాల్ నాయక్

బుక్కరాయసముద్రం: అత్యుత్తమ నాణ్యతకు మారుపేరు భారతీ సిమెంట్ అని కంపెనీ టెక్నికల్ ఇంజినీరు మోతీలాల్ నాయక్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో భారతీ సిమెంట్, సాయిరంగా సిమెంట్స్, కాటి కోటేశ్వరస్వామి ట్రేడర్స్ వారి ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు రూ.లక్ష చొప్పున ఉచిత ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. ఈ సందర్భంగా టెక్నికల్ ఇంజినీరు మాట్లాడుతూ భారతీ సిమెంట్ రోబోటిక్ క్వాలిటీ కంట్రోల్‌తో తయారవుతుందన్నారు. డీలర్ వీర నారప్ప, మల్లికార్జున పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సేవలు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ ఆనందరావు

తాడిపత్రి టౌన్: వాసవీక్లబ్ సేవలు అభినందనీయమని పట్టణ సీఐ ఆనందరావు పేర్కొన్నారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద కంబగిరి స్వామి జ్యువెలర్స్ యజమాని లక్ష్మీనారాయణ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం సీఐ, ఎస్ఐ ధరణిబాబు, ప్రభుత్వాస్పత్రి వద్ద వాసవీక్లబ్ సభ్యులు వంకదార పెద్దమద్దిలేటి, జయవరం సుబ్బరంగయ్య ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైద్యాధికారి రామలక్ష్మి ప్రారంభించారు. వాసవీక్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్లు భూమా సూర్యనారాయణ, శేషాఫణి , కో ఆర్డినేటర్ సుబ్బరామయ్య, సభ్యులు శ్యాం ప్రసాద్, చంద్రమౌళి, సుబ్బరత్నయ్య పాల్గొన్నారు.

వెంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

యల్లనూరు: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. అర్చకులు స్వామికి వేకువజామున నుంచి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి ధ్వజారోహణంపై స్వామి కొలుదీర్చారు. స్వామి శుక్రవారం సింహవాహనం, శనివారం శేషవాహనం, ఆదివారం హనుమద్ వాహనం, సోమవారం గరుడవాహనంపై దర్శనమివ్వనున్నారు. మంగళవారం కల్యాణోత్సవం, బుధవారం రథోత్సవం, గురువారం అశ్వవాహనం, శుక్రవారం వసంతోత్సవం, హంసవాహనం, శనివారం ఏకాంతోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ఈఓ శోభారాణి తెలిపారు.



అలంకరణలో వెంకటేశ్వరుడు,శ్రీదేవి, భూదేవి

పెన్షనర్ల నిరసన

తాడిపత్రి టౌన్ : తహసీల్దార్, సబ్ ట్రెజరీ కార్యాలయం ఎదుట గురువారం బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు నిరసన తెలిపారు. తహసీల్దార్ మునివేలు, ఎస్‌టీఓ ఫరూక్ ఆహమ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. అసోషియేషన్ అధ్యక్షుడు కత్తి లక్ష్మీనారాయణరెడ్డి, సభ్యులు ఉన్నారు.

గుత్తి రూరల్: ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం అధ్యక్షుడు అబూబకర్, సంయుక్త కార్యదర్శి జెన్నె కుళ్లాయిబాబు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్, ఉప ఖజానా అధికారి కార్యాలయాల వద్ద వారు నిరసన తెలిపారు. తహసీల్దార్ మహబూబ్ బాషాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రామ్మోహన్, కోశాధికారి ఫక్రుద్దీన్, సభ్యులు స్వర్ణాంబ, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

గుంతకల్లు రూరల్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 7 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రాము గురువారం తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ బాయ్స్ హైస్కూల్, ఎమ్మార్సీ, ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం వైకేపీ కార్యాలయంలో పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.